క్లుప్తంగా

ఘనంగా బాలికా దినోత్సవం



కంచిలి: బాలికా దినోత్సవంలో విద్యార్థినులు

కంచిలి: బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మగా, గృహిణిగా, ఉద్యోగిగా వివిధ పాత్రలను పోషించే ఆడపిలలను రక్షించుకుందామని వక్తలు అన్నారు. ఈ సందర్భంగా ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో భేటి హై మై భేటి కవితను విద్యార్థినులు చదివి వినిపించారు.

సిమెంట్ బెంచీల వితరణ



బెంచీలను అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

కవిటి: కవిటిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సౌకర్యార్థం సొండికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆరు సిమెంట్ బెంచీలను వితరణగా సమకూర్చారు. వీటిని సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాంజీ సమక్షంలో శనివారం అందజేశారు. మండల సొండికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాండవ చంద్రశేఖర్, మొగిలిపురి నాగేశ్వరరావు, మొగిలిపురి శీతారాం పాల్గొన్నారు.

రూ. 67 వేల ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

టెక్కలి రూరల్: నర్సింగపల్లి గ్రామస్తులు ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన గేదెల పగడాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబం నిరుపేదది కావడంతో అండగా నిలవాలని గ్రామపెద్దలు, యువకులు సంకల్పించారు. 67 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని మృతిరాలి భర్తకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో పోలాకి షణ్ముఖరావు, రౌతు బాలరాజు, ఎన్ని షణ్ముఖరావు, దారపు పాపారావు, పి.సూర్యనారాయణ ఉన్నారు.

అంబేడ్కర్ చిత్రపటాల పంపిణీ



అంబేడ్కర్ చిత్రపటాలతో జైభీమ్‌సేన ప్రతినిధులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మపేటలో ఇంటింటికీ జై భీమ్‌సేన ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా జైభీమ్ సేన జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బి.ఈశ్వరరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయసాధనకు తమ సంఘట కృషి చేస్తుందని.. అందులో భాగంగా ఆయన చిత్రపటాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సంఘ నాయకులు డిప్ప వెంకట్రావు, బోనెల వెంకటరమణ, వాసుదేవరావు, లండ శేఖర్, మాధవరావు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

టెక్కలి: టెక్కలి ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 13వ తేదీ ఉదయం పది గంటలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు సీఐ షేక్ మీరా సాహెబ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు వేలం పాట నిర్వహిస్తున్నట్టుట పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ కార్యాలయంలో నిర్వహించనున్న వేలానికి వెయ్యి రూపాయలు దరఖాస్తు రుసుము చెల్లించి పాల్గొనాలని సూచించారు.

ఆర్టీఛీ కాంప్లెక్స్!



అభివృద్ధికి నోచుకొని ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్

- కనీస వసతులకు నోచుకోని ఇచ్ఛాపురం కాంప్లెక్స్
- కానరాని సమాచారమిచ్చే సిబ్బంది

ఇచ్ఛాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖద్వారంగా నిలిచిన ఇచ్ఛాపురం నియోజకవర్గం కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ కనీస వసతుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బస్సుల రాకపోకలను సూచించే టైమ్‌టేబుల్‌ను ఏర్పాటు చేయలేదు. అలాగే బస్సుల రాకపోకల సమాచారమిచ్చే సిబ్బందిని కూడా అధికారులు నియమించలేదు. దీంతో ఇక్కడ నుంచి ప్రయాణించేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రయాణికులు కాంప్లెక్స్ వచ్చి వారి గమ్యస్థానానికి వెళ్లే బస్సుల సమాచారం తెలియక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

మంచినీరు కరువే..

మౌలికా సదుపాయాలైన మంచినీరు, విశ్రాంతి గదులు, కూర్చునేందుకు బెంచీలు, సరైన మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంప్లెక్స్ ఆవరణలోని మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వాటి నిర్వాహణ సక్రమంగా జరుగడం లేదు. కాంప్లెక్స్ పరిసరాలు మొత్తం పిచ్చిమొక్కలు పెరిగిపోయి చిన్న అడవిని తలపిస్తుంది. ఈ కారణంగా కాంప్లెక్స్ నుంచి బయటికి వచ్చేటప్పుడు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



కాంప్లెక్సు ఆవరణలో నిలిచిన మురుగునీరు



మరుగుదొడ్ల చుట్టూ పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

అలాగే కాంప్లెక్స్ ఆవరణలోని రోడ్డు మొత్తం పాడైపోయింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసిన నీరు చేరుపోతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు నిలిచి పోవడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. సాయంత్రం వేళల్లో బస్సుల కోసం కాంప్లెక్స్‌లో ప్రయాణికులు ఉండలేక అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తరువాత కాంప్లెక్స్ అభివృద్ధిని గాలికి వదిలేసి కూటమి నేతలు కాంప్లెక్స్ ఆవరణలో మాత్రం పార్టీ సంబంధిత కార్యక్రమాలతో పాటు స్థానిక ఎమ్మెల్యే పుట్టినరోజు, పెళ్లి రోజు కార్యక్రమాలను నిర్వహించడానికి వినియోగించుకుంటుంటే ఆర్టీసీ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కనీస సదుపాయాలు కల్పించాలి



ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులకు అవసరమయ్యే కనీస సదుపాయాలైన మంచినీరు, మరగుదొడ్ల సదుపాయాలు కల్పించాలి. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. దీంతో శ్రీకాకుళం, విశాఖపట్నం, రాజమండ్రి వంటి దూరప్రాంతాలకు ప్రయాణించేవారంతా ఇబ్బంది పడుతున్నారు.

– పిట్ట సూర్యనారాయణ, ప్రయాణికుడు, శ్రీకాకుళం

బస్సుల సమాచారం తెలియదు



ఈ కాంప్లెక్స్ నుంచి ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. కనీసం బస్సుల రాకపోకల గురించి తెలియజేసే సమాచారం ఇక్కడ లేదు. మాలాంటి నిరక్షరాస్యులకు సమాచారం ఇచ్చే సిబ్బంది ఎవరో తెలీయడం లేదు. బస్సుల సమాచారం లేకపోవడంతో మాలాంటి ప్రయాణికులంతా ఇబ్బందులు పడుతున్నాము.

– సోమేశ్వరరావు, ప్రయాణికుడు, నరసన్నపేట

జీడి కార్మికులకు న్యాయం చేయాలి



ర్యాలీ చేస్తున్న జీడి, రైస్‌మిల్లు కార్మికులు

మందస: జీడి కార్మికుల సమస్యలు పరిష్కారించాలని, సత్యసాయి క్యాష్యూ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, ఉపాధ్యాక్షులు కె.కేశవరావు, జీడి కార్మికుల నాయకురాలు బాలమ్మ డిమాండ్ చేశారు. సారింగిపురం, ఆర్.కె.పురం పరిధిలోని జీడి, రైస్ మిల్లు కార్మికులతో శనివారం నిరసన ర్యాలీ, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సత్యసాయి యాజమన్యం పది నెలలుగా కార్మికులకు పని కల్పించకుండా చేయడం తగదన్నారు. గ్రాడ్యూటీ, పరిహారం చెల్లించాలన్నారు. ఈ నెల 21వ తేదీలోగా సమస్యలకు పరిష్కారం చూపకపోతే యాజమాని ఇంటి వద్ద నిరసన తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కె.శాంతమ్మ, భారతి, కుమారి, ధనలక్ష్మి, కృష్ణారావు, మల్లేసు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలను కాపాడుకుందాం

- ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్
- శిలగాం, కుసుంపురం, రాజపురం లలో కోటిసంతకాల సేకరణ



శిలగాంలో కోటి సంతకాల సేకరణలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు

కవిటి: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 17 వైద్య కళాశాలలు ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకోవడం అందరి బాధ్యతని ఎమ్మెల్యే నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే కూటమి ప్రభుత్వం ఆలోచనకు వ్యతిరేకంగా శిలగాం, కుసుంపురం, రాజపురం గ్రామ పంచాయితీల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. కోటి సంతకాల సేకరణ లక్ష్యాన్ని ప్రజలకు సాయిరాజ్ వివరించారు. మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ పరం చేయాలనే కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రపూరిత విధానాలను మనమంతా సంఘటితంగా అడ్డుకోవాలని కోరారు. అలాగే గ్రామపంచాయితీల్లో వైఎస్సార్‌సీపీ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. కవిటి ఎంపీపీ కడియాల పద్మ, ప్రకాష్, సనపల కృష్ణారావు, ఊర్మిళ బిసాయి, కర్రి పద్మావతి, ఎన్ని అశోక్, కర్రి సత్యన్నారాయణ, శివబిసాయి, నల్లాన శ్రీను, బి.ఢిల్లిబాబు, లొట్టి సోమేశు, రాఘవ, కొర్లాం మనోజ్ పాల్గొన్నారు.

ఈక్రాప్‌లో ప్రకృతి వ్యవసాయ కమతాలు నమోదు



బారువలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోంపేట: ప్రకృతి వ్యవసాయ కమతాలు కూడా ఈక్రాప్‌లో నమోదు చేయాలని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీ శంకర్‌రావు పేర్కొన్నారు. బేసి రామచంద్రాపురం, బారువ వరి పొలాల్లో ఆంధ్రప్రదేశ్ సామాజిక యాజమాన్య ప్రకృతి వ్యవసాయ విభాగం ద్వారా వ్యవసాయ శాఖ చేపడుతున్న సహజ వ్యవసాయాన్ని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తితో కలిసి ఏడీఏ శనివారం పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. ఈ నెల 25వ తేదీలోగా పంట నమోదు వంద శాతం పూర్తి చేయాలని కోరారు. సహజ పద్ధతులు వ్యవసాయంలో భాగంగా వరిలో రసం పీల్చే సుడిదోమ, పచ్చదోమ ఉనికి, అప్రమత్తత కోసం తోడ్పడే పసుపు రంగు, జిగురు అట్టలు ఏర్పాట్లు పరిశీలించారు. వ్యవసాయ సహాయకులు కుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నడకయాతన!



రాళ్లు తేలిన నెలవంక-డీజీపుట్టుగ రోడ్డు

- శిథిలావస్థలో నెలవంక–డీజీపుట్టుగ రోడ్డు

కవిటి: కవిటి మండలంలో అన్ని రాజకీయ పార్టీలు ఈశాన్య దిక్కున ఉన్న నెలవంక నుంచే ఏ కార్యక్రమమైనా శుభప్రదంగా భావించి ప్రారంభిస్తారు. కానీ ఇక్కడ ప్రజల సమస్యలు తీర్చడంలో మాత్రం ఎందుకో ఒకింత నిర్లక్ష్యధోరణిలోనే ఉంటారనే విమర్శలు ఉన్నాయి.. దీనికి సరిపోయినట్టుగానే నెలవంక నుంచి డీజీపుట్టుగ వెళ్లే రోడ్డు మార్గం దశాబ్దాల క్రితం వేసిన రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నడకకు కూడా స్థానికులు నరకయాతన పడుతున్నారు. కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదనే ఆవేదన చెందుతున్నారు. దుర్గమ్మపుట్టుగ, మధ్యపుట్టుగ, వడ్డిపుట్టుగ, నెలవంక, బైరెడ్లపుట్టుగ, బదకలపుట్టుగ గ్రామాల ప్రజకు ఈ మార్గమే ఆధారం. అనునిత్యం ఈ మార్గంలో డీగొనపపుట్టుగ వెళ్లేందుకు, తమ కొబ్బరితోటలకు వెళ్లి వచ్చేందుకు ఇదే ప్రధాన మార్గం. ఈ రోడ్డు శిథిలావస్థకు చేరడమే కాకుండా జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొత్త వ్యక్తులు ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు రోడ్డు ఇరుకుగా ఉండి గతకుల మయంగా మారడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా రైతులకు రాళ్లు తేలి కాళ్లకు గుచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామీణుల కష్టాలు తీర్చాలి



నెలవంక నుంచి డీగొనపుట్టుగ, రాజపురం, ఇచ్ఛాపురం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు నెలవంక–డీజీపుట్టుగ రోడ్డు చాలా అనువైనది. దాదాపు ఆరేడేళ్లుగా రోడ్డు దారుణంగా దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు అనుభవిస్తున్నాం. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గ్రామీణుల సమస్యను తీర్చాలి.

– కృష్ణారావు, జ్యోతిష్యసిద్ధాంతి, నెలవంక

ప్రయాణికుల రద్దీ..!

- స్త్రీ శక్తి పథకం రీయింబర్స్‌మెంట్‌తో కలిపి రూ.60 లక్షల ఆదాయం
- రద్దీకి తగ్గట్టుగా బస్సుల్లేవంటున్న ప్రయాణికులు



ప్రయాణికులతో రద్దీగా ఉన్న టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్

టెక్కలి: ఈ ఏడాది దసరా తరువాత గౌరీపౌర్ణమి పూజలు నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా కనిపిస్తోంది. అయితే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో చాలామంది ప్రయాణికులు ఆటోలు, ఇతర వాహనాల్లో అవస్థలు పడుతూ ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. సుమారు వారం రోజులుగా ప్రయాణికుల రాకపోకలతో టెక్కలి డిపోకు 60 లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా రాకపోకల్లో అధికంగా మహిళ ప్రయాణికులే కనిపిస్తున్నారు. ఇదిలా ఉండగా టెక్కలి ఆర్టీసీ డిపోకు వచ్చిన ఆదాయాన్ని పరిశీలిస్తే... అధికారులు వేస్తున్న లెక్కలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. వాస్తవానికి దసరా, గౌరీపౌర్ణమి నేపథ్యంలో ఈ డిపోకు సుమారు రూ. 60 లక్షల ఆదాయం వచ్చినట్లు చెబుతున్నారు. స్త్రీశక్తి పథకం రీయింబర్స్‌మెంట్ కలుపుకుని మొత్తంగా 60 లక్షల రూపాయలు ఆదాయం వచ్చినట్లు లెక్కలు కట్టడం గమనార్హం. రీయింబర్స్‌మెంట్‌ను మినహాయిస్తే మూడో వంతు కూడా ఆదాయం సమకూర లేదని తెలిసింది.

ఘనంగా గౌరమ్మ, నందెన్న విగ్రహాల నిమజ్జనం



నిమజ్జనానికి తరలివెళ్తున్న గౌరమ్మ, నందెన్న విగ్రహాలు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో గౌరమ్మ, నందెన్న ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. దీంతో శనివారం నిమజ్జన ఊరేగింపు యాత్రలు ఘనంగా నిర్వహించారు. ప్రగడపుట్టుగలో గౌరీపౌర్ణమి సందర్భంగా ప్రతిష్ఠించిన గౌరమ్మ, నందెన్నల విగ్రహాలను ఐదురోజుల అనంతరం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు కోయిడాన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది.

మద్యం నాణ్యత పరిశీలన



టెక్కలిలోని మద్యం దుకాణంలో శాంపిళ్లను సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

టెక్కలి: మద్యం నాణ్యతపై అనుమానాలు ఉంటే తక్షణమే 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ సూచించారు. టెక్కలిలోని పలు మద్యం దుకాణాల్లో శనివారం తనిఖీలు నిర్వహించి శాంపిళ్లను సేకరించారు. టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల పరిధిలోని 13 మద్యం దుకాణాల్లో ఇప్పటి వరకు సుమారు 111 నమూనాలను సేకరించినట్లు తెలిపారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లలో మద్యం నాణ్యత కోసం శాంపిళ్లను సేకరిస్తున్నట్టు ఎక్సైజ్ అధికారి పి.దుర్గా ప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకు 121 నమూనాలను సేకరించి నాణ్యత పరిశీలన కోసం విశాఖలోని ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపించామన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన వద్దు



కోటి సంతకాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

- మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

పలాస: గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 17 వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనే కూటమి ప్రభుత్వ ఆలోచన ఎంత మాత్రం సరి కాదని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ విధానాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజా ఉద్యమం తీవ్రతరం అవుతోందని హెచ్చరించారు. పలాస నియోజకవర్గంలో గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ అన్ని అనుబంధ సంఘాలను, పార్టీ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. అందుకు పార్టీ ఇచ్చిన సలహాలు.. సూచనలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. పలాసలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం జరిగింది. ముందుగా పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా రూపొందించిన డిజిటల్ బుక్‌ను, అనంతరం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు సంబంధించిన కోటి సంతకాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, అందుకు బూత్ కమిటీలు క్రియా శీలకంగా వ్యవహరించాలని చెప్పారు. అలాగే రచ్చబండ కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అందులో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ఈ నెల 13వ తేదీన నకిలీ మద్యంపై నిరసన కార్యక్రమాలు ఉన్నాయని, వాటిని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడే ప్రతిఒక్కరీని అధిష్టానవర్గం గుర్తించి తగిన సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఇటీవల జరిగిన సమావేశాల్లో మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మన ప్రభుత్వం వస్తోందని, పరిపాలనలో కార్యకర్తలను భాగస్వాములను చేస్తామని చెప్పారని.. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. గ్రామాల్లో కార్యకర్తలను టీడీపీ నాయకులు, ప్రభుత్వ, పోలీసు అధికారులు వేధిస్తే డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు చేయాలని, అందుకు తగిన యాప్ అందుబాటులో ఉందన్నారు. మనల్ని ఇబ్బంది పెట్టిన ఎవరినీ విడిచిపెట్టేది లేదని, అందరు ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంటు) దుంపల లక్ష్మణరావు మాట్లాడుతూ.. కార్యకర్తలు కష్టపడి పనిచేసి అప్పలరాజును మళ్లీ గెలుపించుకొని మరోసారి మంత్రిని చేసుకోవాలని అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు మాట్లాడుతూ.. గ్రామాల్లో మన కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం వల్ల ఇబ్బందులు వస్తున్న మాట వాస్తవమని, అయితే వాటికి భయపడకుండా నిలబడినప్పుడే మన పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. పార్టీకి కార్యకర్తలు మూల స్తంభాలని కొనియాడారు. సమావేశంలో పార్టీ పలాస–కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి, మండల కమిటీ అధ్యక్షుడు దువ్వాడ రవి, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర క్రిష్టారావు, పాలిన శ్రీనివాసరావు, బమ్మిడి దుర్యోధనరావు, దున్న సత్యం, బమ్మిడి సంతోష్‌కుమార్, తిర్రి రాజారావు, బడగల బాలచంద్రుడు, సుజాత పండా, సేనాపతి దివ్య, జల్లు ఉషారాణి, బత్తిన హేమేశ్వరరావు, గుజ్జు జోగారావు, వాయలపల్లి లక్ష్మణ్, డల్లి జానకీరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ కావాలనే ఆశను చిదిమేస్తున్నారు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్



తలగాంలో సంతకాల సేకరణ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జెడ్పీటీసీ సభ్యురాలు వాణి తదితరులు

టెక్కలి: డాక్టర్ కావాలనే పేద, సామాన్య వర్గాలకు చెందిన విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం నాయకులు చిదిమేస్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ దుయ్యబట్టారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్ర ను ప్రజలకు వివరించాలనే ఆలోచనతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పాత నౌపడ, తలగాం, తేలినీలాపురం గ్రా మాల్లో రచ్చబండ–కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు ప్రజలకు హామీలు నెరవేర్చక పోగా గత ప్రభుత్వం అందజేసిన సదుపాయాలను కోత విధిస్తుందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రల్లో భాగమే పీపీపీ విధానమని వివరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంతో కూ టమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసి ఆ తరువాత మెడికల్ మాఫీయా చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఈ కుట్రను తిప్పి కొట్టాలని కోరారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరణ, సంతకాల సేకరణ చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు హనుమంతు వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు దల్లి సంధ్యారాణి, పోలాకి లక్ష్మి, వైస్ ఎంపీపీ పి.రమేష్, నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, నాయకులు సత్తా రు సత్యం, ఆర్.జయమోహన్, జి.మోహన్‌రెడ్డి, వి.శ్రీధర్‌రెడ్డి, కె.అజయ్, కె.రవికుమార్‌గాంధీ, ఎస్.అప్పలరెడ్డి, డి.లోకేష్‌రెడ్డి, జి.యోగేశ్వర్‌రెడ్డి, గౌడ శ్రీనివాస్, టి.కామేశ్వరరావు, బి.గోపాల్, పి.మోహన్, డి.కూర్మారావు, పి.శ్యామలరావు, డి.పోలయ్య, బి.రాజేష్, వి.తవిటయ్య, కె.కామేశ్వర్రావు, రంగారావు, ఎస్.తిరుపతి, ఎస్.వినోద్, పి.చంద్రశేఖర్, ఆర్.ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌పరం చేస్తే ఉద్యమిద్దాం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



మశాఖపురం గ్రామ కమిటీ జాబితాను నరేంద్ర యాదవ్‌కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం రూరల్: మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలతో కలసి ఉద్యమించేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ హెచ్చరించారు. మశాఖపురం, బాలకృష్ణాపురం, ముచ్చింద్ర గ్రామ పంచాయతీల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనకు వ్యతిరేకంగా శనివారం చేపట్టిన కోటి సంతకాల సేకరణ, గ్రామ స్థాయి కమిటీల ఎంపికలో ఆమె మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలో వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని, డాక్టర్ కావాలనే ఆలోచన కలిగిన పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాలకు చెందిన పిల్లలకు వారి లక్ష్యం నెరవేరే విధంగా కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే వాటిని చంద్రబాబు ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడానికి కుట్రపన్నుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణను ప్రారంభించామన్నారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం

క్షేత్రస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో కమిటీలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని సమన్వయకర్త విజయ అన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీల జాబితాను ఆమె పార్టీ రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్‌కు అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్‌లు నీలాపు సారధిరెడ్డి, గుజ్జు ఢిల్లీరావు, ఎంపీటీసీ సభ్యుడు నీలాపు జగదీష్‌రెడ్డి, బదకల మోహన్‌దాస్, రంగాల జానకీరామ్ రెడ్డి, చిరంజీవిరెడ్డి, బోరుబద్ర పాపయ్య పాల్గొన్నారు.